మనిషికీ జంతువుకీ భేదం ఏమిటి? అమ్మాయిలను రోడ్లమీద అల్లరి చేసి శిక్షలకి కూడా పాత్రులవు తున్నారంటే వారిని ఏమని పిలవాలి?

ఈ న్యూసెన్సు తగ్గాలంటే అమ్మాయిలు కొంచెం ధైర్యం వహించవలసిన మాట వాస్తవమే. కాని మూడు లాంతర్ల దగ్గర నిల్చున్న పోలీసుకి చెపితే ఆ సంగతి నాకేం అవసరం? అన్నట్లు చూసి వూరుకోవడమూ, అమ్మాయిలు యింకా హేళనకి గురికావడమూ జరగకూడదు. అమ్మాయిల ధైర్యం సంగతి అటుంచి, ముందు పోలీసులు బాధ్యత ప్రదర్శించాలి. ఇద్దరూ ముగ్గురూ కూడా సైకిళ్ళ మీద పబ్లికుగా వెడుతూన్నా చూసీ చూడనట్టు వూరుకొనేవారు, అమ్మాయిల రక్షణకి పూనుకుంటా రంటే కొంచెం నమ్మడంకష్టమే. అయినా తప్పదు. మినిష్టర్ల కేం! పెద్దలు! అన్నిటికీ ఏదో సాకు దొరుకుతూనే వుంటుంది వారికి - దీర్ఘాలోచన చేయమని నైతికపథాన్ని వదలొద్దనీ అన్నంత మాత్రాన మారిపోయే పరిస్థితులైతే యీనాడు యిన్ని గొడవలే లేవు. ఎప్పుడెప్పుడు ఏ సంఘ సంస్కర్త ఉద్భవించినా, ఘోషించినా వాటి కోసమే. అదేం చిన్న మెత్తుపని చేయలేదు కాని, యిప్పుడు వీరు 'ఉష్' అంటే వూరుకుంటారని భావించడం కూడా హాస్యాస్పదం. ప్రస్తుత పరిస్థితులలో అన్ని రంగాలలోనూ మనకి కావలసినది ధైర్యంగా చర్యలు తీసుకోవడం. అంతేకాని నాన్పుడు వ్యవహారం మాత్రం కాదు. నైతిక ఉద్బోధనలు అంతకంటే కాదు. అమ్మాయిలు ధైర్యం వహించాలి. అబ్బాయిలు నైతిక విలువలు పాటించాలి. పోలీసులు తమ విధులు నిర్వర్తించాలి అన్నా యింతే. ఎటొచ్చీ ఏదీ జరగడం లేదు కనుక అన్నీ జరగాలంటూ వాపోతూ కాలం వృధాచేస్తున్నాం.

అలా కాదు, యీ అమ్మాయిల వేషాలు చూడండి! అసలా నైలానులూ జార్జెట్లూ చాలు మనుష్యుల్ని కవ్వించడానికి అంటారా?—కొంచెం ఆలోచించతగ్గ విషయమే మరి. అయినా యువతులు కూడా చూపరుల్లో నిద్రాణంగా ఉన్న వాంఛలను రెచ్చగొట్టి కవ్వించే పద్ధతిలో అలంకరించుకొని స్త్రీత్వాన్ని మెరిపించకూడదు మరి!

—(రుద్రాణి)

స్కెచ్

# సెక్యులరిజమ్ : ఆచరణలో—

ద్రోణంరాజు కృష్ణమోహన్

"మీరుకూడా పేరు రిజిస్టరు చేసుకోవడానికి వచ్చారల్లే వుంది!" ప్రక్కనే తారట్లాడుతున్న ఒక యువకుడిని చూసి అన్నాను.

"మరేనండి!" ముక్తసరిగా సమాధానమిచ్చాడు.

"మీ పేరు?"

"రాజారావు."

"మిమ్మల్ని పిలుస్తున్నారు!" ఎంప్లాయ్‌మెంటు ఎక్స్ఛేంజి జవాను పిలిచాడు. లోపలికి వెళ్ళాను.

"కూర్చోండి." గౌరవంగా ఆహ్వానించాడు ఆఫీసరు.

"థ్యాంక్స్."

"మీరేం ఉద్యోగం చేయదలచుకున్నారు?"

"నా గ్రాడ్యుయేట్ అర్హతకి తగిన ఏ ఉద్యోగమైనా సరే!"

"అవన్నీ పెట్టుకుంటే కుదరవు. లోయర్ డివిజన్ గుమాస్తా ఉద్యోగానికి మీ అభ్యంతరం?" త్వరగా వదిలించుకోవాలన్న వుద్దేశ్యంతో అన్నాడు.

"ఈషన్మాత్రం లేదు" ఖంగుమని జవాబిచ్చాను.

"సరే అయితే మీరు వెళ్ళవచ్చు."

నా తరువాత కొంతసేపటికి అతనుకూడా రిజిస్టరు చేసుకోవడం పూర్తి అయింది. ఇద్దరం కలిసి కాఫీ సేవించాం. విడిపోతున్నాం.

"మీరెక్కడ దిగింది?" అడిగాను పరిచయం వృద్ధిచేసుకోవాలన్న కోరికతో.

"రామమందిరం వీథి, బస్సుస్టాండు దగ్గిర."

"నేను కాలేజీదగ్గిరలో ఫ్రెండ్ గదిలో."

"మళ్ళీ కలుసుకుందాం" చెయ్యూపాడు సిటీ బస్సు ఎక్కుతూ.

• • •

వారంరోజులు గడిచాయి. కిటికీలో కూర్చుని చూస్తున్నాను. పోస్టుమేన్ కార్డు చేతికిచ్చాడు. ఎగిరి గంతేశాను. అప్పుడే ఇంటర్వ్యూకి రమ్మని పిలుపు. పరుగెత్తేను ఎంప్లాయిమెంటు ఆఫీసుకి.

"జూనియర్ ట్రాన్స్‌లేటర్ వుద్యోగం. అంటే అప్పర్ డివిజన్ గుమాస్తా హోదాతో ప్రారంభం." ఆఫీసర్ మాటలు వుత్సాహం కలిగించాయి. బస్సు కోసం నిలబడ్డాను. వెనకాల భుజంమీద చెయ్యి పడింది. వెనక్కి తిరిగాను.

"మర్చిపోయారా?" రాజారావ్ ప్రశ్న.

"ఏబ్బే, లేదు. మీరుకూడా యింటర్వ్యూకేనా?"

"మరే! మనది ఫైనల్ బ్యాచ్. ఇప్పటికి నాలుగు జట్లను రిజెక్ట్ చేశాడు యింటర్వ్యూ చేసిన ఆఫీసరు."

"అయితే మనిద్దరిలో ఎవరికో ఒకరికి తప్పదు" వుత్సాహంతో అన్నాను.

• • •

ఇద్దరినీ యింటర్వ్యూ చేస్తున్నాడు. అనువాదం చేయమని ఇంగ్లీషునుంచి ఒక పేరా, మాతృభాష నుంచి ఒక పేరా చూపించాడు రెండు పుస్తకాలలో. చకచక వ్రాసేస్తున్నాం.

"మీ బాబాయి నాకు చాలా దగ్గర స్నేహితుడు!" ప్రారంభించాడు ఆఫీసరు, అంటే ప్రభుత్వ ప్రధాన అనువాదకుడు. కొండంత బలం, గంపెడాశ, చెప్పలేనంత వుత్సాహంతో పరవశుడనయాను. ఒక్కసారి రాజారావ్ వంక చూశాను తీవిగా "ఏడిశావ్! నీ కేమిటి వొచ్చేది!" అన్నట్లు. కాని అతను నావైపు చూడనైనా లేదు సరికదా ఏమాత్రం చలించలేదు.

"హుఁ...అలాగా అండి-చాలా సంతోషం" అన్నాను.

"నువ్వు తప్పకుండా పైకివొస్తావ్ జీవితంలో" అహా! అమృతం ఒలికించాడు యీసారి నిజంగా! మళ్ళీ వోసారి వాడివైపు, ఆ రాజారావువైపు, చూశాను చాలా దర్జాగా. ఊహుఁ...చలిస్తేనా ఏ మాత్రమైనా! అన్నీ వింటూనే వున్నాడు. దెబ్బ దెబ్బకు కూలిపోతూ వుండాలి తప్పకుండా! నిరాశా, నిస్పృహలతో వ్రాసేదంతా పాడు చేసేసి వుండాలి!" నన్ను ఏవో యితర ప్రశ్నలు అడిగాడు. ఇంటర్వ్యూ పూర్తయింది. బయటకొచ్చాక రాజారావ్‌ని కొన్ని ప్రశ్నలు వేశాను. అతను వ్రాసినవాటిలో అధికభాగం తప్పులే!

• • •

మూడు రోజులైంది. ఫలితం తెలియలేదు. ఏమీ తోచలేదు. మరో రోజు గడిచింది. ఉండబట్టలేక పోయాను. ఆఫీసు కెళ్ళాను. ఆశ్చర్యం! నా కళ్ళను నేను నమ్మలేకపోయాను! రాజారావ్ పనిచేస్తున్నాడు ఒక టేబుల్ దగ్గిర కూర్చుని.

"ఏఁవిటి! ఎప్పుడు జరిగిందిదంతా?" ఒక గుమాస్తాని మంచి చేసుకుని క్యాంటీన్‌లో కాఫీ పోయిస్తూ అడిగాను.

"ఆ రోజు సాయంత్రమే లోకల్ పోస్టులో అప్పాయింట్‌మెంట్ ఆర్డరు వెళ్ళింది." అన్నాడు.

"అంత నిముషాలమీద ఎలా నిర్ణయం చేశాడు?"

"ముందు చేసుకున్న నిర్ణయమేగదా! ఇందులో కొత్త ఏమీలేదే! మీకు తెలియదా?"

"ఏబ్బే? ఏమిటి కొంచెం చెప్పండి!" తెల్లబోతూ అడిగాను.

"వాళ్ళ కులమే ఆ కుర్రాడిది. ఆ కుర్రాడిని తన అల్లుడిని చేసుకోవాలని ఆయన కోరిక. అందుకోసం ఎంతమంది వచ్చినా వెనక్కి పంపాడు. అతనికోసం రిజర్వు చేశాడు యీ వుద్యోగం! ఉత్తరం వ్రాసి రప్పించాడు యీ వూరు!"

"అదాసంగతీ!"

"మరేనండి. అతను ఆయనింట్లోనే మకాం."

"ఎక్కడది?"

"బస్సుస్టాండు దగ్గిర రామమందిరం వీథి."

తల తిరిగినట్లయింది. ఎక్కడో ఏదో ఎవరో చెప్పినట్లు స్ఫురణకొచ్చింది ... ఆఁ... అవును! రాజారావ్ ఆనాడు బస్సు ఎక్కబోతూ చెప్పిన అడ్రసు!

ఇంతకూ "కుల, మత, రహిత" అంటే నిజంగా ఏమిటో సెక్యులర్ స్టేట్‌లో నాకు ఒక చక్కని అనుభవం కలిగింది. ★